క్లుప్తంగా

ఈకేపీ, కలెక్షన్‌లో ఖేడ్ డిపో అగ్రస్థానం

నారాయణఖేడ్: ఇటీవల నిర్వహించిన మేడారం జాతరకు ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి 30 బస్సులు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ డిపో బస్సులు ఈకేపీ, అత్యధిక కలెక్షన్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాయని డీఎం మల్లేశయ్య తెలిపారు. అత్యధిక ఈకేపీ సాధించిన డ్రైవర్లు బి.ఎస్.రెడ్డి, మల్కయ్య, అత్యధిక కలెక్షన్ తీసుకు వచ్చిన కండక్టరు నర్సింహులును గురువారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శాలువాలతో సన్మానించి నగదు రివార్డును అందజేశారని వివరించారు.

అవిశ్వాసంపై తీర్పు వాయిదా

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాల పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా గురువారం దీనిపై జిల్లా సహకార శాఖ అధికారి తుమ్మ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పీఏసీఎస్ పరిధిలో 13మంది డైరెక్టర్లు ఉండగా, 8మంది అవిశ్వాసానికి మద్దతు పలికారు. బీఆర్‌ఎస్‌కు చెందిన డైరెక్టర్లు సమావేశానికి హాజరు కాలేదు. శంకర్‌రెడ్డి అవిశ్వాసాన్ని వాయిదా వేయాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సమావేశాన్ని15వ తేదీ వరకు వాయిదా వేస్తున్నట్లు తుమ్మ ప్రసాద్ ప్రకటించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలను గురువారం తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్ నారాయణ్ జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రి సందర్భంగా కేతకీ ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని జహీరాబాద్ డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి అన్నారు. కేతకీ ఆలయ ఆవరణలో గురువారం పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు రవి, నయిమోద్దిన్, ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం పేదలకు రేషన్ షాపు ద్వారా పంపిణీ చేసే 58.30 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్పీ రూపేష్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ వద్ద 9.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకొని ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సదాశివపేట పట్టణం బసవేశ్వరవాడకు చెందిన మద్యం మల్లేశం గోదాంలో తనిఖీ చేయగా 49 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సైన్స్‌తోనే సమాజ పురోగతి

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: సైన్సుతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లోని శ్రీవైష్ణవి హైస్కూల్‌లో గురువారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ప్రమేయం లేకుండా ఈ విశాలవిశ్వంలో ఏదీ లేదన్నారు. ఏ విషయం తీసుకున్నా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అది సైన్స్‌తో సంబంధం ఉంటుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ పెంటయ్య, ఎస్‌ఎంఆర్ యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

నారీ శక్తి.. భావితరాలకు స్ఫూర్తి

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటడంలో 'ఆమె'ది ప్రత్యేకమైన స్థానం.. పురుషులతో ఏమాత్రం తీసిపోని విధంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు, మేధావులు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

– పటాన్‌చెరు టౌన్, జిన్నారం, నారాయణఖేడ్, ఝరాసంగం, పటాన్‌చెరు, జహీరాబాద్, కంది, జహీరాబాద్ టౌన్



సంగారెడ్డి టౌన్: కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

చదువు గౌరవాన్ని ఇస్తుంది



నేడు మహిళలు ఉద్యోగ, వ్యాపార రాజకీయ రంగాలతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ ప్రతిభను చాటుతున్నారు. పురుషులతో ఏమాత్రం తీసిపోనివిధంగా రాణించడం అభినందనీయం. చదువు జీవితాన్ని నిలబెట్టడమే కాకుండా గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. తల్లిదండ్రులు ఆడపిల్లలను ప్రోత్సహించాలి.

– భవాని, విశ్వభారతి లా కళాశాల ప్రిన్సిపాల్ (పటాన్‌చెరు టౌన్)

స్త్రీలకు న్యాయం చేయడమే లక్ష్యం



మానవ మృగాల చేతిలో ఎంతోమంది మహిళలు, విద్యార్థినులు బలైపోతున్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు పడేందుకు న్యాయవాద వృత్తిని ఎంచుకున్నా. ఈ సమస్యలన్నిటికీ మహిళల చదువే ఏకైక పరిష్కారం. మహిళలు వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుకుంటూ వారి శక్తిని నిరూపించాలి.

– రమాదేవి, ప్రముఖ న్యాయవాది (పటాన్‌చెరు టౌన్)

మహిళల రక్షణే ధ్యేయం



పోలీసు ఉద్యోగంలో అడుగుపెట్టిన నేను సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నాను. స్త్రీల జీవితాలు, వారి కుటుంబాల్లో జరిగే ఘర్షణలతో జీవితాలు అధోగతి పాలుకాకుండా కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అన్ని బాధ్యతలు నిర్వహిస్తూ ఓర్పుగా ఉండటం మహిళకే సాధ్యం.

– సోమేశ్వరి, అమీన్‌పూర్ ఎస్ఐ

మహిళాశక్తిని చాటాలి



మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ తమ శక్తిని నిరుపించుకోవాలి. ప్రస్తుతం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, సీనియర్ గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. అనేకసార్లు కలెక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల చేతులమీదుగా అవార్డులు పొందాను. మహిళలు పురుషులతో సమానంగా రాణించాలి.

– డాక్టర్ వసుంధర, పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

మహిళల పాత్ర గొప్పది



నేడు అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా గౌరవం పొందుతున్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు కోర్టు నుంచి ఉచిత న్యాయంతో పాటు వారికి ఖర్చులను కూడా న్యాయస్థానమే భరిస్తుంది. మహిళలు తమ హక్కులను కాపాడుకోవాలి.

– ప్రభాకర్‌రావు, సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి

పురుషుడి సహకారం ఉండాలి



స్త్రీలకు పురుషుడి సహకారం తప్పనిసరిగా ఉండాలి. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దు. బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలకు ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా ఉచితంగా పొందవచ్చు. మహిళలు ధైర్యంతో ముందుకు వెళ్లాలి.

– సునీతారెడ్డి, మూడో అదనపు జిల్లా జడ్జి, సంగారెడ్డి

సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలి



మహిళలు సోషల్ మీడియాకు తగినంత దూరంగా ఉండాలి. సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు ఫోటోలను అప్లోడ్ చేయొద్దు. కొత్త పరిచయాలతో అప్రమత్తంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. మహిళలకు అన్ని రంగాలు అద్భుత అవకాశాలు ఉన్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– లావణ్యరెడ్డి, నాలుగో అదనపు జిల్లా జడ్జి, సంగారెడ్డి



జిన్నారం: సన్మానం పొందిన మహిళా ఉద్యోగులతో ఎంపీపీ, ఎంపీటీసీలు



పటాన్‌చెరు: ఎంపీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుష్మశ్రీ



జహీరాబాద్ టౌన్: మహిళా అధ్యాపకులను సన్మానిస్తున్న ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరికుమార్



కంది: పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నారాయణఖేడ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పటాన్‌చెరు టౌన్: వేడుకల్లో పాల్గొన్న విశ్వభారతి లా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



ఝరాసంగం మండల కేంద్రంలో మహిళలను సన్మానిస్తున్న ఎంపీడీఓ సుధాకర్



జహీరాబాద్: డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మహిళా రైతు

వారం రోజుల్లో 'గ్యారంటీ'ల అమలు

మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట/వట్‌పల్లి(అందోల్): మరో వారం రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.138.11 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌లను అమలు చేస్తున్నామని, మార్చి 11న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో అంతా అవినీతి, దోపిడీ జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని దేశ ప్రధానియే ఆరోపించిన విషయాన్ని గుర్తు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు పగుళ్లు వచ్చాయని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జున సాగర్, పోచంపాడు, సింగూరు ప్రాజెక్టులపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కసారిగా సచివాలయానికి వెళ్లకుండా, ప్రజలను కలువకుండా ప్రగతిభవన్ నుంచి పాలన సాగించారని విమర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాంబాబు, ఈపీహెచ్ వీరప్రతాప్, డీసీహెచ్ఓ సంగారెడ్డి, ఆర్‌డీవో పాండు, టీఎస్ ఈడబ్ల్యూ ఐడీసీ డిప్యూటీ ఈఈ రాంకుమార్, కమిషనర్ తిరుపతి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ డేవిడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

వట్‌పల్లికి మరో హామీ..

వట్‌పల్లి మండలానికి మంత్రి దామోదర మరో హామీనిచ్చారు. జోగిపేటలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వట్‌పల్లికి అస్పత్రికి అంబులెన్సును మంజూరు చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వైద్య ఆరోగ్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చూస్తానని తెలిపారు.

వీగిన అవిశ్వాసం

- సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి కొనసాగింపు
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా దక్కని ఫలితం

సంగారెడ్డి: గ్రేడ్ వన్ మున్సిపాలిటీ జిల్లా కేంద్రం సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం గురువారం వీగిపోయింది. చైర్‌పర్సన్‌పై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేసి ఆమెపై గత నెలలో అవిశ్వాస తీర్మాన నోటీసులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అయన గురువారం తేదీని ప్రకటించారు. అప్పటి నుంచి అవిశ్వాసం పెట్టిన సభ్యులు, అవిశ్వాసానికి గురైన సభ్యులు ఒకరిపై మరొకరు ఎత్తులు పైఎత్తులు వేసుకుంటూ ఇప్పటి వరకు కాలం గడిపారు. అయితే విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్‌లు ఏకతాటిపై ఉండకపోవడంతో తిరిగి విజయలక్ష్మి చైర్‌పర్సన్‌గా కొనసాగేందుకు మార్గం సుగమం అయింది. ఉదయం 11:30కు అవిశ్వాస తీర్మాన సమావేశం ఉండగా మధ్యాహ్నం 3గంటల వరకు సైతం ఏ ఒక్కరూ సమావేశానికి హాజరుకాకపోవడంతో పాత చైర్‌పర్సన్‌ను కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

అభివృద్ధి కోసమే అవిశ్వాసం

సంగారెడ్డి బల్దియాలో అభివృద్ధి కుంటుపడుతుందనే అవిశ్వాస తీర్మానం పెట్టినట్టు కొందరు సభ్యులు వెల్లడించారు. అవిశ్వాస తీర్మాన సమావేశంలో అక్కడికి వచ్చిన కొందరు బీఆర్‌ఎస్ సభ్యులు, నాయకులు మీడియాతో మాట్లాడారు. చైర్పర్సన్ విజయలక్ష్మి ఒంటెద్దు పోకడతో అభివద్ధి పనులను చేపట్టడంలేదని తెలిపారు. కొందరు సభ్యుల నమ్మకద్రోహంతోనే అవిశ్వాస తీర్మానం నెగ్గలేకపోయామని నాయకులు నాగరాజుగౌడ్, విజేందర్ రెడ్డి, కౌన్సిలర్లు విష్ణువర్ధన్, శ్రీకాంత్ పేర్కొన్నారు.

వ్యక్తికి రిమాండ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) విధుల్లో ఉన్న పోలీస్ అధికారిపై దాడి చేసిన ఓ యువకుడిని గురువారం రామచంద్రాపురం పోలీసులు రిమాండ్ తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 4వ తేదీన రాత్రి సమయంలో రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌కాలనీకు చెందిన సత్తయ్యను అతని కుమారుడు కిరణ్‌కుమార్ కొట్టడంతో సత్తయ్య 100కు డయల్ చేశాడు. దాంతో పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రాథోడ్ అధికారుల ఆదేశాల మేరకు సత్తయ్య ఇంటికి వెళ్లాడు. సత్తయ్య వద్ద జరిగిన సంఘటన విషయంపై ఆరా తీస్తుండగా మద్యంలో మత్తులో ఉన్న కిరణ్‌కుమార్ మా గొడవలో మీరెందుకు వస్తున్నారంటూ అక్కడే ఉన్న ప్లాస్టిక్ కుర్చీ తీసుకొని హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రాథోడ్ తలపై బలంగా కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలపాలైన హెడ్‌కానిస్టేబుల్ ప్రైవేట్ అసుపత్రికి వెళ్లాడు. అక్కడ శంకర్‌రాథోడ్ తలకు 7కుట్లు వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజాపాలన దరఖాస్తుల వెల్లువ

కంది(సంగారెడ్డి): కంది మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రానికి దరఖాస్తుల తాకిడి అధికమైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే గతంలో చేసుకున్న దరఖాస్తుల్లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో చాలామందికి 200ల యూనిట్లు ఫ్రీ, రూ.500లకు గ్యాస్ సిలిండర్ రావడం లేదు. లబ్ధిదారుల దరఖాస్తులను సరిచేసేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసేవా కేంద్రానికి గురువారం 75 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీఓ మహేందర్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ట్రాలీ ఆటో యూనియన్ కార్యవర్గం**

నారాయణఖేడ్: ఏఐటీయూసీ అనుబంధ నారాయణఖేడ్ ట్రాలీ ఆటో యజమానుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిరంజీవి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆనంద్ ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా అయూబ్, సహాయ కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, సుదర్శన్, గౌస్మియా ఎన్నికయ్యారు.

◆ **ఎగ్జామ్స్ కిట్ల పంపిణీ**

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టెన్త్ క్లాస్ విద్యార్థులకు తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్) సంఘం నాయకులు ఎగ్జామ్స్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. పటాన్‌చెరువు మండల విద్యాధికారి పీపీ రాథోడ్, టీబెస్ రాష్ట ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, పాఠశాల హెచ్ఎం మన్నాన్‌శాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా రామచంద్రారెడ్డి, శ్రీశైలం, మల్లేశం, అశోక్, విఠల్, కార్యదర్శులుగా శేఖర్, ప్రసాద్, తుల్జయ్య, కోశాధికారిగా రాజు, బీసీ మోర్చా అధ్యక్షుడిగా భరత్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మొగులయ్య, యువ మోర్చా అధ్యక్షుడిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. నాయకులు రాజుగౌడ్, ఆదిత్యపాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్ల ప్రారంభం**

జోగిపే(అందోల్): మండల పరిధిలోని పోచారంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాణిక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

◆ **బ్రహ్మకుమారిస్ కేంద్రంలో కార్యక్రమం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శివరాత్రి సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని బ్రహ్మకుమారిస్ కేంద్రంలో కేంద్రం నిర్వహకురాలు నిర్మలబెహన్ ఆధ్వర్యంలో పరమాత్మ శివుని జెండా ఆరోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బెల్ ఈడీ భరనీధర్‌రాజా, కార్పొరేటర్ సింధురెడ్డి, బెల్ జీఎంలు బార్గవ, సుబ్రహ్మణ్యం, కార్మికసంఘం నాయకులు రాజునాయక్, బ్రహ్మకుమారిస్ జాతీయ మీడియా ఇన్‌చార్జి సరళబెహన్ పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ బ్రహ్మకుమారి కేంద్రంలో ఏర్పాటు చేసిన 12 జ్యోతిర్‌లింగాల ప్రదర్శనను కార్పొరేటర్ పుష్ప ప్రారంభించారు.

◆ **ఓటుహక్కునుపై అవగాహన**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్విప్ ఆధ్వర్యంలో షెడ్యూల్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనోడల్ ఆఫీసర్ నాగరత్నం, మాస్టర్ ట్రైనర్ యోగిబాబు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.